క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు గ్రామంలోని శ్రీరామ ఆలయ 13వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. ప్రత్యేక పూజల్లో శ్రీబాల త్రిపుర భైరవాలయం పీఠాధిపతి గణష్ గురూజీ పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

గార : మండలంలోని శాలిహుండం కొండ పైభాగంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ఏకాదశి సందర్భంగా మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహేంద్రాడ సాయిశర్మ ఆధ్వర్యంలో వైదికులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. ధర్మకర్త బోర వెంకటరమణమూర్తి దంపతులతో పాటు అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. కోలకతాకు చెందిన ఓ భక్తుడు 8 తులాల వెండి కిరీటాన్ని అందజేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు మాట్లాడుతూ వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

శ్రీకాకుళం అర్బన్: బలగ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో పిల్లలకు ఆటల పోటీలు, నీతి కథల పోటీలు నిర్వహించారు. విజేతగా నిలిచిన నవ్యశ్రీ, మేఘన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాన కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: తరుణీ కృష్ణ స్మారక ధార్మిక ట్రస్టు(వాడాడ) ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం శ్రీరాముని కీర్తనలను తంగిపన్, మౌనిక, కృషవేణిలు ఆలపించారు. తబలాపై మండ శ్రీనివాసరావు, హార్మోనియంపై రెడ్డి సత్యనారాయణ వాయిద్య సహకారం అందించారు. కారక్రమంలో ట్రస్టు సభ్యులు మండ జగదాంబ, ప్రకాష్, గణేశ్వరరావు, వెంకటరమణమూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న సాయికుమార్ తదితరులు

జి.సిగడాం: మండలంలోని డీఆర్‌వలస గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమరాపు శ్రీనివాసరావు తల్లి సూర్యం ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్.. సర్పంచ్ శ్రీనివాసరావును ఆదివారం పరామర్శించారు. ఈయనతోపాటు కంది ఈశ్వరరావు, కింజరాపు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుమరాపు రమేష్‌నాయుడు, ముషినివలస సర్పంచ్ చందక సతీస్, నాయకులు కుమరాపు సన్యాసిప్పలనాయుడు రాంమూర్తినాయుడు, చందక మహేష్,కుమరాపు నాగభూషణనాయుడు, నాయకులు మామిడి బలరాం ఉన్నారు

శరవేగంగా పీహెచ్‌సీ పనులు

- రూ.2 కోట్ల 60 లక్షలతో కళ్లేపల్లిలో భవన నిర్మాణాలు
- తీరప్రాంత గ్రామస్తులకు తీరనున్న కష్టాలు
- ఇప్పటికే తాత్కాలిక భవనంలో వైద్య సేవలు
- మరో మూడు నెలల్లో పనులు పూర్తి



నిర్మాణంలో ఉన్న కళ్లేపల్లి పీహెచ్‌సీ భవనం



భవనానికి ఇరువైపులా పనులు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని మత్స్యకార గ్రామాల ప్రజలకు వైద్యకష్టాలు త్వరలోనే తీరనున్నాయి. ప్రస్తుతం శ్రీకాకుళం రూరల్ మండలానికి సంబంధించి ఒక్క సింగుపురంలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. జాతీయ రహదారి ప్రధాన మార్గంలో ఉన్న ఈ పీహెచ్‌సీ ద్వారా చుట్టుపక్కల గ్రామాలైన సింగుపురం, బైరి, కరజాడ, నైరా, బట్టేరు, పొన్నాం, రాగోలు, ఎస్ఎస్‌వలస, తండేవలస ప్రజలకు మాత్రమే వైద్య సేవలందేవి. దీంతో సముద్రతీర ప్రాంత గ్రామాలైన కళ్లేపల్లి, పెదగనగళ్లవానిపేట, కుందువానిపేట, ఇప్పిలి, బలివాడ, మోపస్‌బందరు తదితర ప్రాంత గ్రామస్తులు సింగుపురం వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కళ్లేపల్లిలో పీహెచ్‌సీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను రూ.2కోట్ల 60లక్షల నిధులు కేటాయించింది. ఇప్పటికే భవనం పనులు 60 శాతం పూర్తయ్యాయి. మరో మూడు నెలల్లో వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. డాక్టర్ గదులతో పాటు పర్యవేక్షకుల రూమ్‌లు, ల్యాబ్‌లు, మహిళ చెకప్‌లకు వేర్వేరు గదులు వంటివి నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతానికి కళ్లేపల్లిలో తాత్కాలిక పీహెచ్‌సీ భవనం నడుస్తోంది. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్యులు సేవలందిస్తున్నారు.

సేవలు అందుతున్నాయి



మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో పీహెచ్‌సీ మంజూరయ్యింది. కొత్త భవనం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాత్కాలిక పీహెచ్‌సీలో వైద్యసేవలు, మందులు అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ ఆసరాగా నిలుస్తున్నాయి.

– సిమ్మ సాంబశివరావు, కళ్లేపల్లి

సంతోషంగా ఉంది..



మరో మూడు నెలల్లో కళ్లేపల్లిలో పీహెచ్‌సీ పనులు పూర్తవుతాయి. వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. చుట్టుపక్కల ఏడు పంచాయతీల ప్రజలకు దగ్గరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రావడం సంతోషంగా ఉంది.

– బాబు, ఇప్పిలి

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే

రణస్థలం:

భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మంచి బోధనతో పాటు, జీవన నైపుణ్యాలను అలవర్చుతారని మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావు, ఎంఈవో–2 బి.లావణ్య తెలిపారు. రణస్థలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం ఆదివారం చేపట్టిన సర్వేలో ఎంఈవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం రిసోర్స్ టీచర్స్ ఎం.బాలరాజు, ఎం.రూపాదేవిలు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 27 మంది దివ్యాంగ చిన్నారులను గుర్తించామన్నారు. సర్వే ఈ నెల తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ, శారీరక వ్యాయామం అందిస్తామన్నారు. అలాగే జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు సమక్షంలో బుద్ధిమాంద్యం, వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు చెవి మిషన్లు, చక్రాల కుర్చీలు అందజేసినట్టు పేర్కొన్నారు. గ్రామాలో ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే 73827 69689, 97059 27962 నంబర్లకు తెలియజేయాలని కోరారు.



ఎంఈవోల సమక్షంలో సర్వే చేస్తున్న రిసోర్స్ టీచర్లు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణాన్ని చేస్తున్న అర్చకులు

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలోని శివాలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో జరిగిన ఈ ఘట్టాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో తిలకించారు. మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

రామమందిర వార్షికోత్సవాలు ప్రారంభం



పందిరిరాట వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని సీపన్నాయుడు పేటలో రామమందిరం ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అంతకుముందు అర్చకులు బంకుపల్లి అప్పల నర్సింహశర్మ, సుధీర్ శర్మల ఆధ్వర్యంలో పందిరిరాట వేశారు. కార్యక్రమంలో పి.నాగరాజు, అలివేలు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్:

నగరంలోని శాంతినికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక 93వ నెలవారీ సాహితీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ సాహిత్య విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించేలా రచనలు ఉండాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఆర్.రమణమూర్తి మాట్లాడుతూ 93 నెలలుగా తెరవే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను వివరించారు. పలువురు కవులు తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో నిక్కు హరి సత్యనారాయణ, బి.జగన్నాథరావు, నిక్కు అప్పన్న, రెడ్డి లలిత, తంగి యర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కవులు

భవిత కేంద్రాలు.. బహుళ ప్రయోజనాలు

- ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే
- పలాస నియోజకవర్గంలో 425 మంది గుర్తింపు
- 9 వరకు కొనసాగనున్న సర్వే



భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులు

వజ్రపుకొత్తూరు: దివ్యాంగ చిన్నారులు బడిబాట(భవిత కేంద్రం) పట్టేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇళ్లకే పరిమితమైన ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో చదువు మానేసిన వారి వివరాలు సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. సర్వేలో భాగంగా ఇప్పటికే పలాస నియోజకవర్గంలో దాదాపు 70 శాతం మంది దివ్యాంగులను గుర్తించారు. బస్సు, రైలు ప్రయాణాలతో పాటు సామాజిక భద్రతా పింఛన్లు సైతం జారీ చేసేందుకు ప్రయోజనం ఉండటంతో వారంతా బడికి వచ్చేందుకు ముందుకు వచ్చారని భవిత కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

ఇంటింటా సర్వే..

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగ చిన్నారులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వాటిపై అవగాహన లేకపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు వాటి ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వీరికి కూడా విద్యను అందించేందుకు ప్రత్యేక కేంద్రాలు ఉన్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై ఇళ్లకే పరిమితమైపోతున్నారు. ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ఇంటింటా సర్వే చేపడుతున్నారు. మే 1న ప్రారంభమైన ఈ సర్వే వేసవి సెలవులు కావడంతో ముమ్మరంగా సాగుతోంది.



ఇంటింటా సర్వే చేపడుతున్న భవిత కేంద్రం ఉపాధ్యాయులు

బహుళ ప్రయోజనాలు..

- ప్రత్యేక అవసరాల పిల్లల చదువుకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా మంజూరు చేస్తున్నారు.
- నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు.
- వినికిడి దృష్టి లోపం ఉన్నవారికి ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తున్నారు.
- వైకల్య శాతం అధికంగా ఉన్నవారికి సదరం ధ్రువపత్రాలతో సామాజిక భద్రతా పింఛన్ అందించేందుకు కృషి చేస్తారు.
- రైళ్లు, బస్సుల్లో ప్రయాణం చేసేందుకు పాసుల సదుపాయం కల్పిస్తారు. పాఠశాలకు రాలేని వారి ఇళ్లకు ఉపాధ్యాయులే వచ్చి ప్రత్యేక శిక్షణ స్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్టే హాజరు వేస్తారు.

చిన్నారులను గుర్తిస్తున్నాం



మండలాల్లో ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతోంది. ఇప్పటి వరకు చాలా మంది బడికి వచ్చే అవకాశం ఉన్నా దూరంగా ఉన్నారు. అలాంటి చిన్నారుల తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నాం.

– ఎస్.అరుణ, భవిత కేంద్రం టీచర్, వజ్రపుకొత్తూరు

రాయితీలు పొందాలి



ప్రత్యేక అవసరాల పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని ముందుకుసాగాలి. తల్లిదండ్రులు దీనిపై దృష్టి సారించాలి. ఈ నెల 9 వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తాం

– తమ్మినాన రోజారమణి, భవిత కేంద్రం టీచర్, వజ్రపుకొత్తూరు

• కల్యాణ వైభోగమే..



శ్రీకాకుళం నగరంలోని మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు పి.ఆర్.కె. శ్రీవాసశర్మ, సుధీర్ శర్మల ఆధ్వరంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. సంప్రదాయంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

లలితాదేవికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: దోమాం పంచాయతీ కుంచాలకుర్మయ్యపేట గ్రామంలోని లలితాదేవి అమ్మవారికి ఆదివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వంశీకుమార్‌శర్మ తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్త నర్సింగరెడ్డి ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించాలి



చిన్నారులతో మాట్లాడుతున్న నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చొరవ తీసుకోవాలని క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో వేసవి వినోదం పేరిట 4–9వ తరగతుల బాలికల కోసం వివిధ అంశాలపై ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శిక్షణకు హాజరైన బాల బాలికలకు పాటలు, కథలు, కవితలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చెస్, క్యారమ్స్ వంటి క్రీడలపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్లర్లకు దిగితే కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎవరూ అల్లర్లలో పాల్గొనవద్దని రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం రాత్రి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రశాంతంగా నగరం ఉందని, ఇకపైనా చక్కని ప్రవర్తనతో మెలగాలని హితవుపలికారు. కార్యక్రమంలో స్టేషన్ రైటర్ సింహాచలం, క్రైమ్ కానిస్టేబుల్ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఉమామహేశ్వరరావు

బ్రహ్మజ్ఞానం ద్వారా మోక్షం

శ్రీకాకుళం కల్చరల్: బ్రహ్మజ్ఞానం ద్వారా మోక్షం పొందవచ్చని వక్త సనపల నారాయణమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో సనత్సు జాతీయంపై ఉపన్యసించారు. మౌనం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో పతంజలిశాస్త్రి, జోగారావు, నరసింహమూర్తి, వెంకటరమణ, అరుణకుమారి, పి.వి.ఎస్.ప్రసాద్, రంగడు ప్రసాదరావు, బాబూరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శివసాగర్ బీచ్‌లో 'మిరాజ్' సినిమా సందడి



చిత్ర యూనిట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. కె.ఎం.సి. ఫిలింమేకర్స్ బ్యానర్‌పై విష్ణుదేవ్ రచన, దర్శకత్వంలో తెలుగు, ఒడియా భాషలలో తెరకెక్కనున్న మిరాజ్ సినిమా చిత్రీకరణకు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కుమార్‌నాయక్ తొలి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఈ మేరకు స్థానిక నీలకంఠేశ్వర స్వామీ ఆలయంలో చిత్రయూనిట్ ప్రత్యేక పూజలు చేసి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. సస్పెన్స్, యాక్షన్, మిస్టరీ ప్రధానాంశాలుగా చిత్రీకరిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కె.సత్యభాస్కర్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డీఓపీగా మీర అలీఖాన్, మేనేజర్‌గా ప్రదీప్, కొరియోగ్రఫర్‌గా పత్రి తాతారావు, నటీనటులుగా కొంచాడ జీవన్‌చోటు, సుదిష్ట, దదిష్టిరేఖో , దుర్గభవాని, రమేష్ యాదవ్, నారాప్రసాద్, బమ్మిడి కృష్ణారావు, లంక చిన్నంనాయుడు, లక్ష్య, అంకిత, డీఏ స్టాలిన్, మూల తాతయ్య తదితరులు నటిస్తున్నారు.